క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పీఎం పాలెం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటలవరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని జోన్–3 ఏఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పీఎం పాలెం ఆఖరు బస్టాప్ ఏరియా, సిద్ధార్థ నగర్, బాబా కాలేజీ రోడ్డు, ఎఫ్ యార్డు లే అవుట్, కారుషెడ్, బబ్బేలమ్మ గుడి వెనుక వీధి, మాలతాంబ స్కూల్ ఏరియా, పాత పోలీస్ స్టేషన్ ఏరియా, మీ సేవా ఏరియా, సాంకేతిక కాలేజీ, హౌసింగ్ బోర్డు కాలనీ ఏరియా, ఏఎస్సార్ లేఅవుట్, క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్ ఏరియా, వీ కన్వెన్షన్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బెల్ట్‌షాపుపై దాడి

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో బెల్టు షాపుపై దాడి చేసి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ జె.సురేష్ తెలిపారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న ఆవాల రాము నుంచి ఈ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడికి సత్కారం


జనార్ధనరావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

భీమునిపట్నం: న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్. జనార్ధనరావును భీమిలిలోని జమ్మిచెరువు వాకర్స్ క్లబ్ సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జనార్ధనరావు మాట్లాడుతూ త్వరలో భీమిలిలో సబ్ కోర్టు ఏర్పాటు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ఇక్కడి పార్కులో ఆధునీకరణ పనులు చేపట్టాల్సి ఉందని, వాటిని వేగంగా పూర్తి చేసేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు శంకరకుమార్, ఈశ్వరరావు, వెంకటరావు, వర్మ, జోగారావు పాల్గొన్నారు.

నేడు ఏరువాక

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా ఎదురుగా ఉన్న పొలంలో ఆదివారం ఏరువాక కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా రైతులకు విత్తనాలు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

కొత్తమ్మ హుండీ ఆదాయం రూ.7.13 లక్షలు

తగరపువలస: సంగివలస కొత్తమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. రూ.7,13,746 ఆదాయం లభించింది. ఈ ఏడాది మార్చి 25 నుంచి జూన్ 13 వరకు 79 రోజులకు గానూ ఈ ఆదాయం లభించిందని ఆలయ సిబ్బంది తెలిపారు. హుండీల ఆదాయం లెక్కింపులో నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి సభ్యులు పాల్గొనగా దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస ఎస్సీ కాలనీలో అభయాంజనేయస్వామి ఆలయ 6వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శనివారం ఉదయాన్నే మేలుకొలుపు, ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. మహా మృత్యుంజయ హోమం కూడా చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆంజనేయస్వామితో పాటు ఆలయాన్ని అరటిగెలలు, తమలపాకులు, సింధూరం, గారెలు, నిమ్మ, తులసిమాలలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం భజన కార్యక్రమాలను నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

నర్సరీల కేంద్రం అర్చకునిపాలెం

- ఐదు లక్షల మొక్కల పెంపకం
- మూడు జిల్లాల నుంచి వచ్చి మొక్కలు కొనుగోలు
- నర్సరీలతో నిర్వాహకుల స్వయం ఉపాధి


నర్సరీలోని ఎర్ర చందనం


నర్సరీలోని నీలగిరి మొక్కలకు వాటరింగ్ చేస్తున్న నిర్వాహకుడు


నర్సరీలో మామిడి మొక్కలు



పద్మనాభం: పద్మనాభం పంచాయతీలో ఉన్న అర్చకునిపాలెం అనే చిన్న గ్రామం ఇప్పుడు నర్సరీల కేంద్రంగా మారింది. విజయనగరం–సింహాచలం ఆర్ అండ్ బి రహదారి పక్కన ఉన్న ఈ గ్రామం పేరు చెప్పగానే టక్కున నర్సరీలే గుర్తుకు వస్తాయి. ఒకప్పుడు ఒకే ఒక్క ప్రభుత్వ నర్సరీ ఉన్న ఈ ప్రాంతంలో, 1995 నుంచి ప్రైవేట్ నర్సరీల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఇక్కడ 11 నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఇవి గ్రామానికే ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.

ఈ నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. క్రోన్, సాధారణ నీలగిరి, టేకు, మల్బరీ, వేప, ఎర్రచందనం, శ్రీగంధం, మామిడి, సరుగుడు, జీడి వంటి మొక్కలను ఇక్కడ విరివిగా పెంచి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది సుమారు ఐదు లక్షల మొక్కలు పెంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా, క్రోన్ నీలగిరి మొక్కలను తెలంగాణలోని భద్రాచలం నుంచి తీసుకువచ్చి విక్రయిస్తుండగా, మిగిలిన రకాల మొక్కలన్నీ అర్చకునిపాలెంలోని నర్సరీల్లోనే పెంపకం జరుగుతోంది.

వర్షాలతో ఊపిరి

ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో క్రోన్ నీలగిరి మొక్కల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కొంతమంది రైతులు ఆటోల్లో వచ్చి నేరుగా మొక్కలను కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. అయితే అత్యధిక శాతం మంది రైతులు నర్సరీ నిర్వాహకులకు మొక్కలు, వాటిని నాటడానికి కూలీలు, రవాణా వంటి వాటికి సంబంధించిన ఆర్డర్లు ఇచ్చి వెళ్లిపోతారు. నర్సరీ నిర్వాహకులు మొక్కలను, కూలీలను ఆటోల్లో నేరుగా రైతుల పొలాల వద్దకు పంపిస్తారు. మొక్కలు నాటే పని కూలీలకు జూన్ నుంచి సెప్టెంబర్ వరకు దొరుకుతుంది. ఈ కాలంలో రోజుకు సుమారు 30 మంది వరకు కూలీలకు పని లభిస్తుంది. మొక్కలు నాటేందుకు మహిళలకు రోజుకు రూ. 400, మగవారికి రోజుకు రూ. 700 కూలి వస్తుంది. ప్రస్తుతం క్రోన్ నీలగిరి మొక్కలు ఎక్కువగా అమ్ముడవుతుండగా, ఇతర రకాల మొక్కల విక్రయాలు ఇంకా వేగం పుంజుకోలేదు.

స్థానికులకు ఉపాధి కల్పన

జనవరి నుంచే నర్సరీల నిర్వాహకులు మొక్కల పెంపకం ప్రక్రియకు సన్నద్ధమవుతారు. నారు వేయడానికి ముందు పాలిథిన్ సంచుల్లో మట్టి నింపడం నుంచి.. మొక్కలు పెరిగేంత వరకు కలుపు తీయడం వంటి పనులకు జనవరి నుంచి మే నెల వరకు కూలీలకు చేతి నిండా పని దొరుకుతుంది. సుమారు ఐదు నెలల పాటు ప్రతిరోజూ అర్చకుని పాలెం, పద్మనాభం గ్రామాలకు చెందిన 40 మంది వరకు కూలీలకు ఈ నర్సరీల ద్వారా ఉపాధి లభిస్తుంది. నర్సరీల వల్ల నిర్వాహకులకు, కూలీలకు ఇరువురికీ ప్రయోజనం చేకూరుతోంది.

ఉమ్మడిజిల్లాల నుంచి కొనుగోలుదారులు

ఈ నర్సరీల నుంచి మొక్కలను కొనుగోలు చేయడానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని రాజాం, పొందూరు, ఉమ్మడి విజయనగరం జిల్లాలోని డెంకాడ, గరివిడి, బొబ్బిలి, జొన్నాడ, పాచిపెంట, అలాగే ఉమ్మడి విశాఖ జిల్లాలోని చోడవరం, కాపులుప్పాడ, పెందుర్తి వంటి ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారులు వస్తుంటారు. సకాలంలో వర్షాలు కురిస్తే మొక్కల విక్రయాలు జోరుగా సాగుతాయి.


నర్సరీలో టేకు


నర్సరీలోని శ్రీగంధం


నర్సరీల నుంచి ఆటోల్లో మొక్కలు తీసుకువెళుతున్న దృశ్యం

కూలీలకు ఉపాధి



మా గ్రామంలో 11 వరకు నర్సరీలు ఉన్నాయి. జనవరి నుంచి మొక్కలు పెంచే ప్రక్రియ నర్సరీల్లో ప్రారంభమవుతుంది. మొక్కలు మే నెలాఖరుకు పెరుగుతాయి. స్థానికంగా పెంచిన హైబ్రిడ్ నీలగిరి, భద్రాచలం నుంచి తెచ్చిన క్రోన్ నీలగిరి మొక్కలు జూన్ నుంచి సెప్టెంబర్ వరకు అమ్ముడవుతాయి. రైతుల పొలాల్లో ఈ మొక్కలు నాటేందుకు నర్సరీలు నిర్వాహకులు తమను మొక్కలతో పాటు పంపిస్తారు. మొక్కలు నాటేందుకు మహిళలకు రోజుకు రూ.400, మగవారికి రూ.700 కూలి లభిస్తుంది.

–టి. ఆదెప్పడు, మహిళా కూలీ, అర్చకునిపాలెం

దత్తిరాజేరు నుంచి వచ్చి..



మా ప్రాంతంలో నీలగిరి మొక్కలు కొనడానికి లభ్యం కావు. మా ఊరు నుంచి అర్చకునిపాలెం 70 కిలోమీటర్లు. నీలగిరి మొక్కలు కొనడానికి అర్చకునిపాలెం వచ్చాను. ఇక్కడ నర్సరీలో క్రోన్ నీలగిరి మొక్కలు ఆరు వేలు కొనుగోలు చేశాను. ఆటోలో వీటిని తీసుకుని వెళతున్నాను.

–ఎం.రామస్వామి, కె.కొత్తవలస, దత్తిరాజేరు మండలం, విజయనగరం జిల్లా

30 వేల మొక్కలు పెంచా



ఈ ఏడాది సుమారు 30 వేలు వరకు మొక్కలు నర్సరీలో పెంచాను. కూలీ పనులకు వెళ్లకుండా స్వయంగా నర్స రీలు నిర్వహించుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నాం. మా నర్సరీల్లో జనవరి నెల నుంచి సెప్టెంబర్ వరకు కూలీలు ఉపాధి పొందుతారు. వర్షాలు కురిస్తేనే తమ కష్టానికి ఫలితం దక్కుతుంది. జూన్ నెల నుంచి బాగా వర్షాలు కురిస్తే మొక్కలు చెల్లుబాటు అవుతాయి. వర్షాలు కురవడంతో క్రోన్ నీలగిరి మొక్కలు అమ్ముడవుతున్నాయి. వర్షాలు కురిస్తే సెప్టెంబర్ వరకు మొక్కలు అమ్ముడవుతుంటాయి. గత ఏడాది టేకు మొక్కలు ఐదు వేల వరకు అమ్ముడు కాకుండా ఉండిపోయాయి.

–టి. నర్సింగరావు, నర్సరీ నిర్వాహకుడు, అర్చకునిపాలెం

17న పెన్షనర్ల సంఘం ప్రాంతీయ సదస్సు


పెన్షనర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న బాబాజీ

తగరపువలస: పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 17న నగరంలోని ఎన్ఏడీ కూడలిలోని ఆహ్వానం కల్యాణ మండపం వద్ద ఉదయం 9:30 గంటలకు జరిగే జిల్లా పెన్షనర్ల సదస్సును విజయవంతం చేయాలని చిట్టివలస జూట్ మిల్ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు కోరారు. శనివారం చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో జరిగిన పెన్షనర్ల సమావేశంలో సీనియర్ నాయకులు మాట్లాడుతూ, కార్మికుల పెన్షన్ కష్టాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వద్ద వేల కోట్ల రూపాయల మూలధన భవిష్య నిధులు ఉన్నప్పటికీ కార్మికుల పెన్షన్ పెంచడానికి అంగీకరించడం లేదని విమర్శించారు. ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకోవడం తప్ప కార్మికులకు ఎలాంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత ధరలకు అనుగుణం గా పెన్షన్‌ను రూ.7500కు పెంచాలని అనేక నిరసనలు తెలియజేసినా స్పందన రావడం లేదని నాయకులు అన్నారు. ఈ పెన్షనర్ల సదస్సుకు కార్మిక వాడ నుంచి పెద్ద ఎత్తున పెన్షనర్లు పాల్గొని తమ సత్తా చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కానురి రాంబాబు, సింగిడి అప్పారావు, దామోదర బాబాజీ, మోర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

‘వసూళ్ల కింగ్’పై ఆరా

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెవెన్యూ విభాగం ఉద్యోగులలో కలకలం ప్రారంభమైంది. శుక్రవారం ‘సాక్షి’లో ప్రచురితమైన అడ్డదారి వసూళ్లలో ‘కింగ్’ కథనంపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. మరోవైపు రెవెన్యూ సిబ్బంది ఆగడాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రక్షాళన జరిపి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిబ్బందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ ఉద్యోగి గతంలో మధురవాడ, అనకాపల్లి జోన్లతో పాటు సూర్యబాగ్ ప్రాంతంలోనూ అక్రమ వసూళ్లపై స్థానికుల, ప్రజా ప్రతినిధుల నుంచి విమర్శలు ఎదుర్కొన్నట్లు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా జోన్‌లో ఒకరు చేయాల్సిన ఉద్యోగంలో ఇద్దరు ఉండటంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి జోన్‌లోని కొందరు ఉద్యోగులు బాసటగా నిలుస్తున్నారు..ఉన్నతాధికారులతో పైరవీలు మొదలుపెడుతున్నారు. ‘అతను మనవాడే, చూసీ చూడనట్లు వదిలేయండి’ అంటూ రిక్వెస్ట్ చేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

యోగా డేని విజయవంతం చేయాలి


యోగాసనాలు వేస్తున్న బాలికలు


బంటుపల్లి కళ్లాలలో యోగాసనాలు వేస్తున్న ఉపాధి హామీ కూలీలు, సిబ్బంది


పాలవలసలో యోగాసనాలు వేస్తున్న ఉపాధిహామీ కార్మికులు

కొమ్మాది: ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతానికి సహకరించాలని యోగా గురువు రవి కిశోర్ అన్నారు. శనివారం సాగర్‌నగర్ సమీపంలోని ప్రభుత్వ అంధబాలికల పాఠశాల వద్ద విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. యోగా కార్యక్రమంలో అందరు పాల్గొనాలని కోరారు.

వేడుకలకు సన్నాహాలు

తగరపువలస: భీమిలి, ఆనందపురం మండలాలు, జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో గల గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో శనివారం యోగాంధ్ర–2025పై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 21న జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల, జీవీఎంసీ పరిధిలో ఉన్న ప్రజలందరినీ భాగస్వామ్యం చేసేందుకు అధికారులు, విద్యార్థులు, ఉపాధి హామీ కూలీలు ఇందులో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్మాణాలపై నిర్లక్ష్యం

ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోని రైతు బజార్, గిడ్డంగులు


రైతుబజారులో నిరుపయోగంగా మారిన దుకాణాలు


లొడగలవానిపాలెంలో 12 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకుని గిడ్డంగులు

తగరపువలస: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆనందపురం సబ్ మార్కెట్ యార్డ్‌లోని వేములవలస మార్కెట్‌ను ఆనుకుని, లొడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో 14 ఏళ్ల క్రితం నిర్మించిన రైతుబజారు, 12 ఏళ్ల క్రితం నిర్మించిన గిడ్డంగులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. కోట్ల విలువైన ఈ ఆస్తులు నిరుపయోగంగా పడి ఉండటంపై మండల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మార్కెట్ కమిటీ యాజమాన్యం తాళాలు వేసి ఉంచినప్పటికీ, చీకటి పడగానే ఈ ప్రాంతం ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. గంజాయి, మద్యం సేవించడానికి గాను వెనుక నుంచి ప్రహరీని పాక్షికంగా కూల్చి లోపలికి ప్రవేశించి తిష్ట వేస్తున్నారు. అంతేకాకుండా, ఈ ప్రాంతంలో ఒంటరిగా వెళ్లే మహిళలను వేధిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వేములవలస మార్కెట్ ఆదాయం కోసమే లొడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న వీటిని వినియోగంలోకి తీసుకురాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులకు దూరంగా వసతులు

వాస్తవానికి ఆనందపురం మండలంలోనే భీమిలి నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో రైతులు ఉన్నారు. వారంతా ఇక్కడి వేములవలస మార్కెట్‌లో ఎండైనా, వానైనా ఆరుబయటే తమ ఉత్పత్తులను విక్రయించుకోవాల్సిన పరిస్థితి. నిరుపయోగంగా పడి ఉన్న రైతుబజారును వినియోగంలోకి తీసుకొస్తే రైతులతో పాటు వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అలాగే, గిడ్డంగులను నిరుపయోగంగా ఉంచే బదులు, వాటిని కళ్యాణ మండపంగా మార్చి మండల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. రైతుబజారు ఆవరణ విశాలంగా ఉండటంతో, తరచూ దొడ్డిదారిన ఇక్కడ అనధికారికంగా ఫంక్షన్లు నిర్వహిస్తున్నప్పటికీ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎలాంటి ఆదాయం రావడం లేదు. శిథిలమైన ప్రహరీని పునరుద్ధరించి రైతుబజారు, గిడ్డంగులకు రక్షణ కల్పించడంతో పాటు, వాటిని ఆదాయ వనరులుగా మార్చుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


14 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని రైతు బజారు


శిథిలమైన ప్రహరీ

జీవీఎంసీ పనులపై అసంతృప్తి

- ఆరు రోజులుగా రోడ్డుపైనే చెత్త
- క్రికెట్ స్టేడియం–కార్‌షెడ్ మధ్య జరుగుతున్న పనులతో ఇబ్బందులు


హైవే సర్వీసు రోడ్డు మురుగు


బబ్బేలమ్మ, శివాలయాల ముందు రోడ్డుపై మురుగు


కార్‌షెడ్ జంక్షన్ వద్ద రోడ్డుకు అడ్డంగా స్లాపర్లు

మధురవాడ: జీవీఎంసీ అధికారులు చేపడుతున్న పనుల తీరుపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి క్రికెట్ స్టేడియం నుంచి కార్‌షెడ్ వరకు జరుగుతున్న పనులే నిదర్శనంగా పేర్కొంటున్నారు. పీఎంపాలెం డాక్టర్ వైఎస్సార్–ఏసీఏ వీడీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది జంక్షన్ వరకు హైవే సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న కాల్వల్లో పేరుకుపోయిన పూడిక మట్టిని సుమారు రూ. 74 లక్షల అంచనా వ్యయంతో తొలగించే పనులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అయితే ఈ పనులను పగటి పూట చేయడం వల్ల క్రికెట్ స్టేడియం వైపు ఉన్న సర్వీస్ రోడ్డును మూసివేస్తున్నారు. అంతేకాకుండా, కాల్వలపై ఉన్న శ్లాబులను కూడా తొలగించారు. కనీసం ఎండిపోయిన చెత్తను కూడా తొలగించకుండా రోడ్డుపైనే వదిలేయడం వల్ల అటువైపు రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా, రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణాల్లోకి వెళ్లడానికి అవకాశం లేక వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దేవాలయాల ముందు మురుగు, చెత్తను రోడ్డుపై వేసేయడంతో భక్తులు మరింత ఆందోళన చెందుతున్నారు. పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయో కూడా అధికారులు స్పష్టం చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు, ఆందోళనలు

ఇక్కడ పరిస్థితే ఇలా ఉంటే కార్‌షెడ్ నుంచి కొమ్మాది జంక్షన్ మధ్య ప్రత్యామ్నాయ రోడ్డు సౌకర్యం కూడా లేదు. దీంతో అక్కడ కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఈ పనులను రాత్రి పూట నిర్వహించాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్య తీరుపై స్థానికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ప్రజల సహకరించాల్సిందే..

ఈ విషయమై వర్క్స్ ఈఈ శాంతి రాజు వివరణ కోరగా, పనులు పూర్తయినంత వరకు చెత్త తొలగించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. రెండు వరుసల్లోని స్లాబుల్లో పేరుకుపోయిన చెత్తను తీయాల్సి ఉందని, రాత్రి పూట పనులు చేయడం కూడా ఇబ్బందేనని తెలిపారు. ఈ పనులకు పోలీసు అనుమతి కూడా పొందామని, ప్రజలంతా సహకరించాలని కోరారు.


కాలువల దుస్థితి

హెచ్చరిక బోర్డు ఏర్పాటు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మధురవాడ: విశాఖ రెవెన్యూ గ్రామం, కొమ్మాది రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 153/2లో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోంది. ఇటీవల వీఆర్‌వో గబ్బాడ శ్రీను, వీఆర్‌ఏ బంగార్రాజులు ఇక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఆక్రమణదారులు ఆ బోర్డును తొలగించి మరీ నిర్మాణాలు చేపట్టడంతో, అధికారులు రెండోసారి బోర్డును పెట్టాల్సి వచ్చింది. కోట్ల రూపాయల విలువైన 70 సెంట్ల ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి అధికార పార్టీకి చెందిన పెద్దల పేరు చెప్పుకొని ఆక్రమాలకు పాల్పడుతున్నాడు. అయితే అతనిపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

కూచిపూడి నృత్య ప్రదర్శన నేడు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని స్థానిక ఏవో రమేష్ రెడ్డి తెలిపారు. నగరంలోని నృత్య కళాంజలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన చెప్పారు.